News Daily
ఎడిటర్ : B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

# CK NEWS చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website cknewstv.in

సంపుటి : 05 | సంచిక :67 | ఖమ్మం | బుధవారం, ఏప్రిల్ 22, 2026 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

# పార్టీ బలోపేతమే లక్ష్యంగా... కేసీఆర్ మరో కీలక సమావేశం ఏర్పాటు

ఈ నెల 27న తెలంగాణ భవన్‌లో అత్యున్నత స్థాయి సమావేశం

పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా భేటీ

భవిష్యత్ పోరాటాలకు శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్న గులాబీ బాస్



బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవాల సందర్భంగా, పార్టీ అధినేత కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 27వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో అత్యున్నత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పార్టీ సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా ఈ భేటీ జరగనుంది. పార్టీ సభ్యత్వాల పునరుద్ధరణ కార్యక్రమంపై కేసీఆర్ ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించనున్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీని రీ-ఆర్గనైజ్ చేసే దిశగా ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశానికి పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు, జెడ్పీ మాజీ చైర్మన్లను ఆహ్వానించారు. రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో, భవిష్యత్ పోరాటాల కోసం శ్రేణులకు కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. ముఖ్యంగా రజతోత్సవ వేడుకల ముగింపు సందర్భంగా ఒక భారీ యాక్షన్ ప్లాన్‌ను ప్రకటించే అవకాశం ఉంది.

# కేసీఆర్ తన కళ్లతో బీఆర్ఎస్ అంతం కావడం చూడాలని కోరుకుంటున్నాం: ధర్మపురి అర్వింద్



- కేసీఆర్‌ను అందరికంటే ఎక్కువగా కేటీఆర్, కవితలే హింసిస్తున్నారని వ్యాఖ్య
- వారికి ఫ్లైట్ టికెట్ ఇచ్చి పంపిస్తే కేసీఆర్, తెలంగాణ దరిద్రం పోతుందన్న అర్వింద్
- కాంగ్రెస్ పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న అర్వింద్

కేసీఆర్ తన కళ్లతో బీఆర్ఎస్ అంతమవడం చూడాలని తాము కోరుకుంటున్నామని, అది కూడా త్వరలో జరుగుతుందని నమ్ముతున్నామని బీజేపీ నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. కేసీఆర్‌ను అందరికంటే ఎక్కువగా కేటీఆర్, కవిత, హరీశ్ రావులే హింసిస్తున్నారని ఆరోపించారు. కవిత, కేటీఆర్‌లకు ఫ్లైట్ టిక్కెట్ ఇచ్చి పంపిస్తే కేసీఆర్ దరిద్రంతో పాటు తెలంగాణ దరిద్రం కూడా వదులుతుందని వ్యాఖ్యానించారు.
అర్వింద్ రైతుల సమస్యలపై కూడా మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో రైతులు
తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా కొనుగోలు కేంద్రాల్లో అస్తవ్యస్థ పరిస్థితులు నెలకొన్నాయని విమర్శించారు. రైతుల గోడును పట్టించుకునే వారే కరవయ్యారని అన్నారు. ఈ సందర్భంగా పసుపు రైతులకు ఆయన కీలక హామీ ఇచ్చారు. తాను రాజకీయాల నుంచి తప్పుకునే లోపు పసుపు పంటకు క్వింటాల్‌కు రూ.30 వేల మద్దతు ధర పలికించి తీరుతానని అన్నారు. రైతుల ప్రయోజనాలే తనకు ముఖ్యమని చెప్పారు.

# కేసీఆర్ ఆదేశాల మేరకే ఢిల్లీకి వెళ్లాను.. కానీ!: హరీశ్ రావు




తమ పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు తాను ఢిల్లీకి వెళ్లానని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ఆయన చెప్పిన పని కోసమే తాను, వినోద్ కుమార్ తదితరులం వెళ్లామని చెప్పారు. ముఖ్యమంత్రి పెట్టే అక్రమ కేసులను ఎదుర్కోవడానికి, కాళేశ్వరం కేసులపై ఢిల్లీకి వెళ్లి లాయర్లతో చర్చించినట్లు చెప్పారు. కానీ తన ఢిల్లీ పర్యటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎంవో నుంచి లీకులు ఇచ్చారని, మీడియా వాళ్లతో అర్థం లేని బ్రేకింగ్‌లు పెట్టించారని ఆరోపించారు. విషయం ఉన్న వారు ఎవరైనా ఇలాంటి పనులు చేయరని, విషయం లేనివారే ఇలా చేస్తారని విమర్శించారు.

**ఓటుకు నోటు కేసు విచారణ**

రేపు ఓటుకు నోటు కేసు కూడా సుప్రీంకోర్టులో విచారణకు రానుందని, ఆ కేసు గురించి న్యాయవాదులతో చర్చించామని అన్నారు. ఈ కేసులో నాటి ముఖ్యమంత్రి, హోంమంత్రి కూడా ఇంప్లీడ్ అయ్యారని, కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం తరఫున అనామక లాయర్‌ను పెట్టారని విమర్శించారు. నిందితుల తరపున మాత్రం ప్రముఖ లాయర్ ముకుల్ రోహత్గీని పెట్టుకున్నారని చెప్పారు. రేపటి విచారణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముద్దాయిగా ఉన్నారని గుర్తు చేశారు. గత నాలుగున్నరేళ్లుగా ఆయన స్టే మీద ఉన్నారని చెప్పారు. రేవంత్ రెడ్డి ఢిల్లీలో రాత్రి రాహుల్ గాంధీతో, ఉదయం బీజేపీ వారితో తిరిగారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ నిన్న బయటకు వచ్చినందనే రెండో విడత రైతు భరోసా నిధులు విడుదల చేశారని అన్నారు. పంట పెట్టుబడిగా ఇవ్వాల్సిన సొమ్మును పంట చేతికి వచ్చాక ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థాయి, తమ పార్టీ అధినేత కేసీఆర్ స్థాయి ఏమిటో తెలంగాణ ప్రజలకు నిన్నటి బహిరంగ సభలతో అర్థమైందని అన్నారు. కేసీఆర్ జగిత్యాల సభ ప్రసంగాన్ని 36 లక్షలమంది చూస్తే, రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని కేవలం 4 లక్షలమంది మాత్రమే చూశారని అన్నారు. రేవంత్ రెడ్డి తెలిసి చేశారో లేక తెలియక చేశారో కానీ కేసీఆర్ సభ సమయంలోనే రేవంత్ రెడ్డి తన సభను ఏర్పాటు చేసుకోవడంతో ఎవరి రేటింగ్ ఏమిటో తెలిసిందని అన్నారు.

# ప్రపంచంలోనే అత్యంత వేడి నగరాల్లో ఒకటిగా మంచిర్యాల

ప్రపంచంలోనే అత్యంత వేడి నగరాల జాబితాలో 14వ స్థానంలో మంచిర్యాల

మంచిర్యాలలో అత్యధికంగా 43.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు

అటవీ విస్తీర్ణం తగ్గడమే ఉష్ణోగ్రతల పెరుగుదలకు కారణమంటున్న నిపుణులు

హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లోనూ 41 డిగ్రీలు దాటిన ఎండలు



తెలంగాణలో ఎండలు మండిపోతున్నాయి. భానుడి భగభగలకు రాష్ట్ర ప్రజలు అల్లాడిపోతున్నారు. ఎండల తీవ్రత ఏ స్థాయిలో ఉందంటే, మంచిర్యాల ప్రపంచంలోనే అత్యంత వేడి నగరాల్లో ఒకటిగా నిలిచింది. అమెరికాకు చెందిన ప్రముఖ వాతావరణ సంస్థ 'ఎల్డోరాడో వెదర్' తాజాగా రూపొందించిన ప్రపంచంలోని 100 అత్యంత వేడి నగరాల జాబితాలో మంచిర్యాల 14వ స్థానంలో నిలవడం గమనార్హం.
సోమవారం (ఏప్రిల్ 20) మంచిర్యాలలో 43.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఎల్డోరాడో వెదర్ జాబితాలో మహారాష్ట్రలోని అకోలా 45 డిగ్రీలతో అగ్రస్థానంలో ఉంది. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలను పరిశీలిస్తే.. కొత్తగూడెం, గద్వాలలో 43.3, నిర్మల్, నిజామాబాద్‌లలో 43.0 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రాంతంలో ఎండలు ఇంత తీవ్రంగా ఉండటానికి భౌగోళిక కారణాలతో పాటు అటవీ విస్తీర్ణం తగ్గడమే ప్రధాన కారణమని వాతావరణ శాఖ (ఐఎండీ) శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు. మహారాష్ట్రలోని విదర్భ సరిహద్దులో ఉండటం వల్ల, మధ్య భారతం నుంచి వీచే పొడి, వేడి గాలులు ఇక్కడ ఉష్ణోగ్రతలను అమాంతం పెంచుతున్నాయి. దీనికి తోడు 2021లో 18,561 చదరపు కిలోమీటర్లుగా ఉన్న తెలంగాణ అటవీ విస్తీర్ణం, 2023 నాటికి 18,456 చదరపు కిలోమీటర్లకు తగ్గింది. ప్రధానంగా ఆదిలాబాద్, కొత్తగూడెం, ఆసిఫాబాద్ జిల్లాల్లో పచ్చదనం తగ్గడం వల్లే సహజసిద్ధమైన చల్లదనం లోపించి హీట్ వేవ్స్ తీవ్రత పెరుగుతోందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.
మరోవైపు రాజధాని హైదరాబాద్‌లోని పట్టణ ప్రాంతాలు కూడా గ్లోబల్ హీట్ లిస్టులో చేరుతున్నాయి. మూసీ నది పరీవాహక ప్రాంతం కావడం, వేగంగా జరుగుతున్న పట్టణీకరణ, భూగర్భ జలాలు పడిపోవడం వల్ల ఇక్కడ వేడి ఎక్కువగా ట్రాప్ అవుతోంది. నగరంలోని న్యూ నాగోల్ ప్రాంతంలో 41.7 డిగ్రీల సెల్సియస్ నమోదు కాగా, ముషీరాబాద్‌లో 41.6, అంబర్‌పేటలో 41.4, మల్కాజిగిరి, ఎల్బీనగర్ ప్రాంతాల్లో 41.3, మెహదీపట్నంలో 41.1 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా పగటిపూట ఎండలు దంచికొడుతున్నా.. రానున్న 24 గంటల్లో కొన్ని చోట్ల ఊరట లభించే అవకాశం ఉంది. నిజామాబాద్, నల్గొండ, సూర్యాపేట, రంగారెడ్డి, హైదరాబాద్, వరంగల్, హనుమకొండ, వికారాబాద్, మెదక్, మేడ్చల్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల, కామారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లో సాయంత్రం వేళ ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన కురిసే సూచనలు ఉన్నాయని వాతావరణ శాఖ తెలిపింది. అయితే, పగటి పూట ఎండ తీవ్రత మాత్రం 40 నుంచి 45 డిగ్రీల మధ్యే కొనసాగే ప్రమాదం ఉందని, బయటకు వచ్చే ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

# తెలంగాణకు 8 కొత్త రైళ్లు

- తెలంగాణ ప్రయాణికులకు శుభవార్త.. 8 కొత్త రైళ్లు ప్రకటించిన కేంద్రం
- తెలంగాణలో రైల్వే కనెక్టివిటీని పెంచుతూ 8 కొత్త వీక్లీ రైళ్లు
- కాచిగూడ, చర్లపల్లి, నాంపల్లి నుంచి ఈ రైళ్లు నడపనున్నట్టు వెల్లడి
- తిరుపతి, భువనేశ్వర్, జైపూర్ వంటి నగరాలకు మెరుగైన ప్రయాణ సౌకర్యం
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఈ కొత్త రైళ్ల వివరాలను అధికారికంగా ప్రకటించిన వైనం



తెలంగాణ ప్రయాణికులకు కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ శుభవార్త చెప్పింది. రాష్ట్రంలో రైల్వే కనెక్టివిటీని మరింత బలోపేతం చేసే దిశగా 8 కొత్త వీక్లీ ప్రత్యేక రైళ్లకు ఆమోదం తెలిపింది. ఈ రైళ్లు హైదరాబాద్‌లోని కాచిగూడ, చర్లపల్లి, నాంపల్లి స్టేషన్ల నుంచి తిరుపతి, తిరుచానూర్, భువనేశ్వర్, జైపూర్, శ్రీ గంగానగర్ వంటి కీలక నగరాలకు రాకపోకలు సాగిస్తాయి. ఈ కొత్త రైళ్ల ఏర్పాటుపై కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. తెలంగాణలో రైల్వే మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి నిరంతరం సహకరిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కొత్త రైళ్లు రాష్ట్ర అభివృద్ధికి, పౌరుల సౌకర్యానికి ఎంతగానో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు.

**కొత్తగా ప్రకటించిన రైళ్ల పూర్తి వివరాలు:**

1.ట్రైన్ నెం. 17607/17608: కాచిగూడ – తిరుచానూర్ (ప్రతి గురువారం రాత్రి 9:30 గంటలకు, మే 15 నుంచి ప్రారంభం)
2.ట్రైన్ నెం. 17601/17602: కాచిగూడ – శ్రీ గంగానగర్ (ప్రతి శనివారం రాత్రి 10:00 గంటలకు, జులై 14 నుంచి ప్రారంభం)
3.ట్రైన్ నెం. 17047/17048: చర్లపల్లి – తిరుచానూర్ (ప్రతి బుధవారం సాయంత్రం 6:55 గంటలకు, మే 7 నుంచి ప్రారంభం)
4.ట్రైన్ నెం. 17441/17442: చర్లపల్లి – తిరుపతి (ప్రతి బుధవారం రాత్రి 9:20 గంటలకు, మే 14 నుంచి ప్రారంభం)
5.ట్రైన్ నెం. 17443/17444: చర్లపల్లి – తిరుపతి (ప్రతి శుక్రవారం సాయంత్రం 4:20 గంటలకు, మే 15 నుంచి ప్రారంభం)
6.ట్రైన్ నెం. 17059/17060: చర్లపల్లి – తిరుచానూర్ (ప్రతి ఆదివారం రాత్రి 9:15 గంటలకు, మే 11 నుంచి ప్రారంభం)
7.ట్రైన్ నెం. 17067/17068: చర్లపల్లి – భువనేశ్వర్ (ప్రతి సోమవారం సాయంత్రం 6:10 గంటలకు, మే 5 నుంచి ప్రారంభం)
8.ట్రైన్ నెం. 17079/17080: నాంపల్లి – జైపూర్ (ప్రతి శుక్రవారం రాత్రి 7:50 గంటలకు, ప్రారంభ తేదీ ప్రకటించాల్సి ఉంది)

# రేవంత్‌రెడ్డికి గవర్నర్ మద్దతు ఎంత



తెలంగాణ మంత్రి అజరుద్దీన్ కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రంగంలోకి దిగారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అజారుద్దీన్ ఈ నెల 30 లోగా ఏదైనా చట్టసభలో సభ్యుడిగా ఎన్నిక కావాల్సివుంది. అలాకాని పక్షంలో ఆయన మంత్రి పదవి నుంచి తప్పుకోవాల్సివుంటుంది. దీంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం ఆకస్మికంగా గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కలిశారు. మంత్రి అజారుద్దీన్ తోపాటు ప్రొఫెసర్ కోదండరామ్ ను ఎమ్మెల్సీగా నామినేట్ చేసిన ఫైల్ ను ఆమోదించాలని కోరారు. ప్రధానంగా మంత్రి అజారుద్దీన్ ను నామినేట్ చేసే అంశంపైనే సీఎం దృష్టిపెట్టారని చెబుతున్నారు.సాధారణంగా గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీల నియామకంపై రాష్ట్ర ప్రభుత్వ సిఫార్సులను గవర్నర్ లు యథాతథంగా ఆమోదిస్తారు. కానీ, తెలంగాణలో రాజకీయ పరిస్థితుల కారణంగా ఇద్దరు ఎమ్మెల్సీల నియామకం పెండింగ్ లో

పడిపోయినట్లు చెబుతున్నారు. మంత్రి అజారుద్దీన్ ను ఎమ్మెల్సీగా నామినేట్ చేస్తూ గత ఏడాది అక్టోబరు 28న తెలంగాణ మంత్రి మండలి తీర్మానం చేసింది. ఈ తీర్మానం ఆమోదించాల్సిందిగా గవర్నర్ కు సిఫార్సు చేసింది. ఇక ఆ నెల 31న అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణం చేశారు. ప్రభుత్వం సిఫార్సు చేయడంతో అజారుద్దీన్ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అయితే ప్రభుత్వ సిఫార్సులను గవర్నర్ ఇంతవరకు ఆమోదించలేదు. అజారుద్దీన్ మంత్రిగా ఉన్న సమయంలో గవర్నర్ జిష్ణుదేవ్ ఉండగా, తర్వాత ఆయన బదిలీ అయ్యారు. కొత్త గవర్నర్ గా శివప్రతాప్ శుక్లా వచ్చారు. ఈ కారణంగా ఎమ్మెల్సీలుగా అజారుద్దీన్, కోదండరాం నియామకం పెండింగులో ఉండిపోయినట్లు చెబుతున్నారు. అయితే ప్రొఫెసర్ కోదండరాంకు సంబంధించి న్యాయవివాదం ఉండటంతోనే గవర్నర్ ఏ నిర్ణయం తీసుకోలేకపోతున్నారని

ప్రచారం జరుగుతోంది. దీంతో అజారుద్దీన్ పేరును సైతం ఆమోదిస్తారా? లేదా? అనే ఉత్కంఠ నెలకొంది. మరో పది రోజుల్లో గవర్నర్ ఆమోదం లభించకపోతే అజారుద్దీన్ మంత్రి పదవి నుంచి

తప్పుకోవాల్సివుంటుందని నిపుణులు చెబుతున్నారు. అదే జరిగితే ఈ పరిణామం రాజకీయంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి దెబ్బగా వ్యాఖ్యానిస్తున్నారు. దీంతో ముందుజాగ్రత్త చర్యగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అయితే గవర్నర్ నిర్ణయమేంటో మాత్రం తెలియలేదు. దీంతో అజ్జూభాయ్ మంత్రి పదవిపై తీవ్ర ఉత్కంఠ కొనసాగుతోంది.

గవర్నర్ కోటాలో శాసన మండలికి పంపించాలని సీఎం రేవంత్ రెడ్డి పట్టుబడుతున్న వారిలో ప్రొఫెసర్ కోదండరాం.. సహా.. ప్రస్తుతం మంత్రిగా ఉన్న అజారుద్దీన్ ఉన్నారు. వీరిలో అజారుద్దీన్ పరిస్థితి అత్యంత ముఖ్యంగా మారింది. ఆయన ఇప్పటికే ఆరు మాసాలుగా మంత్రిగా ఉన్నారు. కానీ, ఏ సభలోనూ ఆయన ప్రాతినిధ్యం లేదు. ఈ నెల 30 లోటా అంటే.. కేవలం 11 రోజుల్లోనే ఆయనను మండలికి సిఫార్సు చేయాల్సి ఉంది. అలా చేయకపోతే.. మంత్రిపదవిని సైతం ఆయన కోల్పోవడం ఖాయం. ఇక, కోదండరాంను ఇప్పటికే గతంలో గవర్నర్ కోటా కింద సిఫార్సు చేసినా.. అది ఫలించలేదు. ఉద్యమ నాయకుడిగా పేరుతెచ్చుకున్న కోదండరాంను సభకు పంపించడం ద్వారా.. రాజకీయ మైలేజీ ఉంటుందని రేవంత్ ఆశలు పెట్టుకున్నారు.ఈ ఇద్దరిని గవర్నర్ కోటాలోనే మండలికి పంపించాలని భావిస్తున్నారు. ప్రస్తుతం కేంద్రం ఆగ్రహంతో ఉన్న నేపథ్యంలో.. కేంద్రం చెప్పుచేతల్లోనే గవర్నర్‌లు పనిచేస్తున్న కారణంగా.. రేవంత్ ఆశలు ఫలిస్తాయా? అనేది ప్రశ్న. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# తెలంగాణలో పెరగనున్న భూముల ధరలు



తెలంగాణలో భూముల మార్కెట్ విలువలను సవరించేందుకు రేవంత్ సర్కార్ రెడీ అయింది. వ్యవసాయ భూముల విలువ గరిష్టంగా 300 శాతం పెరగనుండగా.. ఓఆర్ఆర్ పరిసరాల్లోని ప్లాట్ల రేట్లు మూడింతలు కానున్నట్లు తెలిసింది. అపార్ట్‌మెంట్ ఫ్లాట్ల ధరలను స్వల్పంగా పెంచి.. కమర్షియల్ స్పేస్ రేట్లను మాత్రం తగ్గించాలని ప్రతిపాదించారు. రిసోర్స్ మొబిలైజేషన్ కేబినెట్ సబ్ కమిటీ ఆమోదం అనంతరం ఈ కొత్త ధరలు అమల్లోకి రానున్నాయి. దీనివల్ల ప్రభుత్వానికి ఆదాయం పెరగడమే కాకుండా రియల్ రంగంలో పారదర్శకత రానుంది.తెలంగాణలో రియల్ ఎస్టేట్ రంగానికి ఊపునిచ్చేలా రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకునేందుకు రెడీ అయింది. రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ భూములు, నివాస స్థలాల మార్కెట్ విలువను భారీగా పెంచేందుకు రేవంత్ సర్కార్ కసరత్తు చేస్తోంది. వచ్చే నెలలో లేదా జూన్ నుంచి ఈ పెరిగిన ధరలు అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూముల విలువను సవరించడం ఇదే తొలిసారి కావడంతో రియల్ ఎస్టేట్ రంగంలో ఈ అంశం హాట్ టాపిక్‌గా మారింది.ప్రభుత్వ ప్రతిపాదనల ప్రకారం.. వ్యవసాయ భూముల మార్కెట్ విలువ గరిష్టంగా రెండు నుంచి మూడు రెట్లు పెరగనుంది. ప్రస్తుతం ఎకరాకు రూ. 6 లక్షలుగా ఉన్న విలువ రూ. 12 లక్షల నుంచి రూ. 18 లక్షల వరకు పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా నగర శివార్లలోని కోర్ అర్బన్ ప్రాంతాల్లో మార్కెట్ విలువ బహిరంగ మార్కెట్ రేట్ల కంటే చాలా తక్కువగా ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఎకరా విలువ ప్రభుత్వ లెక్కల్లో రూ. 20 లక్షలు ఉంటే.. బయట రూ. 10 కోట్ల నుంచి రూ. 20 కోట్లు పలుకుతోంది. ఇలాంటి చోట్ల మార్కెట్ విలువను ఏకంగా 300 శాతానికి పైగా పెంచి అసమానతలను తగ్గించాలని సర్కార్ భావిస్తోంది.ఔటర్ రింగ్ రోడ్ పరిసర ప్రాంతాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రీజినల్ రింగ్ రోడ్, ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టుల వల్ల ఈ ప్రాంతాల్లో భూములకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. దీనికి అనుగుణంగానే ఇక్కడి ఓపెన్ ప్లాట్లు, నివాస స్థలాల ధరలను 2 నుంచి 3 రెట్లు పెంచనున్నారు. అలాగే అపార్ట్‌మెంట్లలోని ఫ్లాట్ల విలువను కూడా స్వల్పంగా పెంచనున్నారు. ప్రస్తుతం ఎస్ఎఫ్‌టీకి రూ. 2,200 ఉన్న ధరను రూ. 2,800 కు పెంచే అవకాశం ఉంది. ఈ నిర్ణయంతో రిజిస్ట్రేషన్ ఖర్చులు పెరిగినప్పటికీ.. బ్లాక్ మనీ లావాదేవీలు తగ్గి పారదర్శకత పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.నివాస స్థలాల రేట్లు పెరుగుతున్నా, వాణిజ్య స్థలాల విషయంలో ప్రభుత్వం ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం మార్కెట్ రేట్ల కంటే ఎక్కువగా ఉన్న కొన్ని ప్రాంతాల్లో కమర్షియల్ స్పేస్ విలువను తగ్గించాలని ప్రతిపాదించారు. ఎస్ఎఫ్‌టీకి రూ. 7 వేలు ఉన్న విలువను రూ. 6,500 కి తగ్గించే అవకాశం ఉంది. దీనివల్ల కొత్త కంపెనీలు, పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చేందుకు ఆసక్తి చూపుతాయని తద్వారా ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. కేబినెట్ సబ్ కమిటీ అధ్యయనం తర్వాత దీనిపై అధికారిక ప్రకటన వెలువడనుంది.

# గులాబీ గూటికి ప్రీతిరెడ్డి...




తెలంగాణ రాజకీయాలు ఎప్పుడూ అనూహ్య మలుపులకు వేదికవుతూనే ఉంటాయి. తాజాగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి భారత ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ కావడం అటు రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోనూ.. ఇటు దేశ రాజధాని ఢిల్లీలోనూ పెను చర్చకు దారితీసింది. మల్లారెడ్డి వంటి సీనియర్ నేత.. అదీ రాష్ట్రంలో ప్రతిపక్షంలో ఉన్న పార్టీకి చెందిన ఎమ్మెల్యే, నేరుగా ప్రధానిని కలవడం వెనుక ఉన్న రాజకీయ గూఢార్థాలు ఇప్పుడు విశ్లేషణలకు పని పెడుతున్నాయి వారసత్వ రాజకీయాల కొత్త అడుగు ఈ భేటీలో అందరినీ ఆకర్షించిన ప్రధానాంశం మల్లారెడ్డి తన కోడలు ప్రీతిరెడ్డిని వెంట తీసుకెళ్లడం.. సాధారణంగా రాజకీయ నాయకులు తమ వారసులను జాతీయ స్థాయి నేతలకు పరిచయం చేస్తున్నారంటే.. అది భవిష్యత్తు ప్రాతినిధ్యానికి పునాది అని అర్థం. గత కొంతకాలంగా ప్రీతిరెడ్డి ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని ఆకాంక్షిస్తున్నారు. ముఖ్యంగా పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయాలనే తన కోరికను ఆమె గతంలోనే బహిరంగ పరిచారు. ఇప్పుడు ప్రధాని మోదీతో భేటీ ద్వారా.. ఆమెను బీజేపీ తరఫున ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దింపే దిశగా మల్లారెడ్డి పావులు కదుపుతున్నట్లు స్పష్టమవుతోంది. తెలంగాణలో అధికార మార్పిడి జరిగిన తర్వాత బీఆర్ఎస్ లో ఒక విధమైన సందిగ్ధత నెలకొంది.

పార్టీలోని కీలక నేతలు తమ రాజకీయ భవిష్యత్తు కోసం ప్రత్యామ్నాయాలను వెతుక్కుంటున్నారు. మల్లారెడ్డికి మేడ్చల్, మల్కాజిగిరి పరిసర ప్రాంతాల్లో బలమైన ఆర్థిక, సామాజిక పట్టు ఉంది. ఆయన వంటి నేత పార్టీని వీడితే అది గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో బీఆర్ఎస్‌కు కోలుకోలేని దెబ్బ అవుతుంది. అయితే బీఆర్ఎస్ శ్రేణులు దీనిని "మర్యాదపూర్వక భేటీ"గా అభివర్ణిస్తున్నప్ప టికీ రాజకీయాల్లో 'అకస్మాత్తు మర్యాదలు' ఉండవనేది జగమెరిగిన సత్యం. మరోవైపు తెలంగాణలో పాగా వేయాలని చూస్తున్న భారతీయ జనతా పార్టీకి మల్లారెడ్డి వంటి 'మాస్' ఇమేజ్ ఉన్న నేతలు అవసరం. ఆర్థిక వనరులు, విద్యాసంస్థల నెట్‌వర్క్ ఉన్న మల్లారెడ్డి కుటుంబం బీజేపీలోకి వస్తే, అది పార్టీకి అదనపు బలాన్ని ఇస్తుంది. బండి సంజయ్‌తో ప్రీతిరెడ్డి గతంలో జరిపిన భేటీని, ఇప్పటి మోదీ భేటీని కలిపి చూస్తే.. మల్లారెడ్డి కుటుంబం కమల తీర్థం పుచ్చుకోవడానికి ముహూర్తం ఖరారైనట్లే కనిపిస్తోంది. . కేవలం ప్రయోజనాలు మాత్రమే ఉంటాయన్న నానుడి మల్లారెడ్డి విషయంలో మరోసారి రుజువయ్యేలా ఉంది. ఒకవేళ మల్లారెడ్డి బీజేపీ గూటికి చేరితే, అది తెలంగాణలో కొత్త రాజకీయ సమీకరణాలకు దారితీస్తుంది. తన రాజకీయ వారసురాలిగా కోడలు ప్రీతిరెడ్డిని దిల్లీ పీఠం వైపు నడిపించేందుకు మల్లారెడ్డి వేసిన ఈ 'మాస్టర్ ప్లాన్' ఎంతవరకు పారుతుందో కాలమే నిర్ణయించాలి. ఏది ఏమైనా ఈ భేటీ బీఆర్ఎస్ శిబిరంలో ఆందోళనను, బీజేపీ వర్గాల్లో ఉత్సాహాన్ని నింపిందనడంలో సందేహం లేదు. రాబోయే రోజుల్లో వెలువడే అధికారిక ప్రకటనలు తెలంగాణ రాజకీయాల్లో మరిన్ని ప్రకంపనలు సృష్టించవచ్చు.

## మునగాల యాదమ్మకు నివాళులర్పించిన

# భూక్యా సురేష్ నాయక్

### అంత్యక్రియల నిమిత్తం రూ.5వేల ఆర్థిక సహాయం





ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ 30వ వార్డు మదర్ థెరిస్సా కాలనీకి చెందిన మునగాల యాదమ్మ మంగళవారం మరణించారు. విషయం స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా తెలుసుకొని యాదమ్మ నివాసానికి వెళ్లి ఆమె పార్థివదేహం వద్ద ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు భూక్యా సురేష్ నాయక్ నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని తెలిపి ధైర్యంగా ఉండాలని సూచించారు. మృతురాలి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియల నిమిత్తం తన సొంత నిధుల నుండి రూ.5వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా వారితో పాటు మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు గుర్రం రాకేష్ రెడ్డి, గిజ్జన్, మల్లేష్, భద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ పై ప్రేమను చాటుకున్న చిన్నారి

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పై ఓ చిన్నారి తన ప్రేమను చాటుకుంది. సోమవారం నాడు జరిగిన జగిత్యాల ప్రజా ఆశీర్వాద సభ అనంతరం బస్సులో వెళ్తుండగా కేసీఆర్ చిత్రపటాన్ని పట్టుకొని చిన్నారి తండ్రి భూజాలపై కూర్చుని కనిపించింది. చిన్నారిని చూసిప కేసీఆర్ బస్సు ఆపి చిత్రపటాన్ని స్వీకరించి, చిన్నారిని చిరునవ్వుతో ఆప్యాయంగా పలకరించారు.

## 3 బీహెచ్‌కే కంప్లల్సరీ అంటున్న హైదరాబాదీలు..

**హైదరాబాద్, ఏప్రిల్ 21,** హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ ఇప్పుడు మునుపెన్నడూ లేని విధంగా కొత్త పుంతలు తొక్కుతోంది. ఒకప్పుడు 'సొంత ఇల్లు' అంటే 2 బీహెచ్‌కే అనేది మధ్య తరగతి కలగా ఉండేది, కానీ ఇప్పుడు ఆ ఆలోచనా ధోరణిలో స్పష్టమైన మార్పు వచ్చింది. కేవలం తల దాచుకోవడానికే కాకుండా, ఇంటిని ఒక ఆఫీసుగా, వినోద కేంద్రంగా మార్చుకోవాలనే తపన హైదరాబాద్ వాసుల్లో స్పష్టంగా కనిపిస్తోంది.4బీహెచ్‌కే లే హాట్ కేకులు! హైదరాబాద్ మహానగరం ఇప్పుడు కేవలం ఐటీ హబ్‌గానే కాదు.., లగ్జరీ రియల్ ఎస్టేట్ రాజధానిగా కూడా అవతరిస్తోంది. గతంలో ఇల్లు అంటే కేవలం బెడ్రూంలు, హాల్ మాత్రమేఅనుకునే వారు, కానీ కొవిడ్ తర్వాత మారిన జీవనశైలి ప్రజల ప్రాధాన్యతలను పూర్తిగా మార్చేసింది. నేడు కొనుగోలుదారులు చిన్న ఇళ్ల కంటే విశాలమైన 3బీహెచ్‌కే లేదంటే 4బీహెచ్‌కే ఫ్లాట్ల వైపునకేమొగ్గు చూపుతున్నారు. ఫలితంగా కోకాపేట నుంచి తెల్లాపూర్ వరకు ఆకాశహర్మ్యాలు వెలుస్తూ, హైదరాబాద్ రియల్ ఎస్టేట్ ముఖచిత్రాన్ని మార్చేస్తున్నాయి. హైదరాబాద్‌లో ఈ మార్పు రావడానికి ప్రధానకారణం 'వర్క్ ఫ్రమ్ హోమ్' లేదా 'హైబ్రిడ్ వర్కింగ్' మోడల్. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, కార్పొరేట్ ఉద్యోగులు రోజుకు కనీసం 8 నుంచి10 గంటలు ఇంటి నుంచే పని చేయాల్సి వస్తోంది. దీంతోబెడ్రూమ్‌లో కూర్చొని పని చేయడం కంటే, ఏకాంతంగా ఉండే ఒక ప్రత్యేకమైన ఆఫీస్ గది అవసరమని భావిస్తున్నారు. అందుకే 2బీహెచ్‌కే లో సరిపెట్టుకోకుండా, అదనంగా ఒక గది ఉండేలా 3బీహెచ్‌కే లేదా4బీహెచ్‌కే కావాలని కోరుకుంటున్నారు. ఆ నాలుగో గదిని ఆఫీసుగానో, లైబ్రరీగానో లేదా కిడ్స్ ప్లే ఏరియాగానో వాడుకుంటున్నారు. హైదరాబాద్ నగరంలోని పడమర (భాగం ఇప్పుడు లగ్జరీ నిర్మాణాలకు

చిరునామాగా మారింది. కోకాపేట, నార్సింగి, తెల్లాపూర్, గండిపేట వంటి ప్రాంతాల్లో చదరపు అడుగు ధర ?9,000 నుంచి ?15,000 వరకు ఉన్నప్పటికీ, డిమాండ్ ఏమాత్రం తగ్గడం లేదు.కోకాపేటలో వెలుస్తున్న నియోపోలిస్ వంటి అత్యాధునిక లేఅవుట్లు అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులను కల్పిస్తున్నాయి. గేటెడ్ కమ్యూనిటీల్లో క్లబ్ హౌస్‌లు, ఒలింపిక్ సైజ్ స్విమ్మింగ్ పూల్స్,విశాలమైన బాల్కనీలు, గ్రీన్ జోన్స్ ఉండడం సంపన్న వర్గాలను, సీనియర్ ఐటీ ప్రొఫెషనల్స్‌ను విపరీతంగా ఆకర్షిస్తోంది. ప్రజలు ఇల్లు కొనేటప్పుడు కేవలం ప్రస్తుత అవసరాలనే కాకుండా, రాబోయే 10-15 ఏళ్ల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుంటున్నారు. ఉమ్మడి కుటుంబాల సంస్కృతి మళ్లీ కొంత మేర పెరుగుతుండడం లేదా తల్లిదండ్రులు, అతిథులు వచ్చినప్పుడు ఇబ్బంది లేకుండా ఉండాలని పెద్దఇళ్లకే ప్రాధాన్యత ఇస్తున్నారు. చిన్న ఇళ్ల కంటే పెద్ద లగ్జరీ ఇళ్లకు భవిష్యత్తులో రీసేల్ వాల్యూ ఎక్కువగా ఉంటుందని పెట్టుబడిదారులు నమ్ముతున్నారు. రియల్ ఎస్టేట్ నిపుణుల అంచనా ప్రకారం, 2026చివరి నాటికి హైదరాబాద్‌లో అమ్ముడయ్యే మొత్తం ఫ్లాట్లలో 60 శాతానికి పైగా 3బీహెచ్‌కే , అంతకంటే పెద్దవే ఉండే అవకాశం ఉంది. ఇది హైదరాబాద్‌ను ముంబై, బెంగళూరు వంటి నగరాల కంటే ఖరీదైనమార్కెట్‌గా మారుస్తోంది. కేవలం మధ్యతరగతి మార్కెట్ నుండి 'ప్రీమియం మార్కెట్' వైపు హైదరాబాద్ అడుగులు వేస్తోంది. ఈ లగ్జరీ ట్రెండ్ నగర ప్రతిష్టను పెంచుతున్నప్పటికీ, సామాన్యుడికి మాత్రంగగణం అవుతోంది. భూముల ధరలు పెరగడంతో బిల్డర్లు కూడా చిన్న ఇళ్ల కంటే లాభాలు ఎక్కువగా వచ్చే పెద్ద ప్రాజెక్టులకే మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా ?50-60 లక్షల బడ్జెట్‌లో ఇల్లు దొరకడంఅనేది ఇప్పుడు హైదరాబాద్‌లో అసాధ్యంగా మారిపోయింది. ఏదేమైనా, హైదరాబాద్ రియల్ ఎస్టేట్ ఇప్పుడు తనకంటూ ఒక ప్రత్యేకమైన బ్రాండ్ ఇమేజ్‌ను సంపాదించుకుంది.

## నాగులవంచ లో మొక్కజొన్న రైతుల రాస్తారోకో



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని:మొక్కజొన్నలు 26 క్వింటాళ్ళ పరిమితిని ఎత్తివేసి రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే మార్క్ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని కోరుతూ ఖమ్మం - బోనకల్ ప్రధాన రహదారిపై నాగులవంచ లో ̄హ= విగ్రహం వద్ద
చింతకాని మండల తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు నాయకులు మాట్లాడుతూ కొనుగోలు చేసిన మొక్కజొన్న బస్తాలు ట్రాన్స్పోర్టేషన్ చేసేందుకు సరిపడా లారీలను ఏర్పాటు చేసి కొనుగోలు చేసిన పంటను తరలించాలని డిమాండ్ చేశారు. 9గంటల నుండి రైతులు రాస్తారోకో నిర్వహించడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించి. ాఆ వీరేందర్ తో పాటు సొసైటీ జజూ యాలమూడి శ్రీనివాసరావులు వచ్చి రైతు నాయకుల్ని శాతింపజేయడంతో రాస్తారోకో విరమించారు.

## ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని సన్మానించిన మాజీ మంత్రి



**సీకే న్యూస్ ప్రతినిధి, వనపర్తి జిల్లా:**
ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో స్కాలర్స్ కళాశాలకు చెందిన విద్యార్థిని మహాలక్ష్మి ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీ విభాగంలో 1000 మార్కులకు గాను 993 మార్కులు సాధించి ప్రతిభ చాటింది. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తన నివాసంలో మహాలక్ష్మిని ఘనంగా సన్మానించారు.
ఈ సందర్భంగా ఆమె తల్లిదండ్రులు చంద్రకళ, చంద్రమౌళిని అభినందించి, మహాలక్ష్మి ఉన్నత విద్యను అభ్యసించి సమాజ సేవలో ముందుండాలని సూచించారు. తాను అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో నందిమల్ల అశోక్, ప్రేమ్ నాథ్ రెడ్డి, పవిత్ర భాను ప్రకాష్, నీలస్వామి, వెంకట్ సాగర్, రవి ప్రకాష్, నాగరాజు, మోహనాచారి, సేనాపతి తదితరులు పాల్గొన్నారు.

## ధర్మసాగర్ మండల కేంద్రంలో ధర్మసాగర్ గ్రామ ఇందిరమ్మ కమిటీ సభ్యుల రాజీనామా



**సి కె న్యూస్ ఏప్రిల్ 21 మంగళవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ప్రతినిధి కమలాకర్** నిజమైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ ఏర్పాటు చేసిన ఇంద్రమ్మ కమిటీకి లబ్ధిదారుల ఎంపికలో ,నిర్మాణ విషయంలో ఎలాంటి సమాచారం లేకుండా సలహాలు సూచన తీసుకోకుండా ప్రభుత్వ ఉద్దేశాన్ని, ఎమ్మెల్యే ఉద్దేశాన్ని పాటించకుండా ఇష్టం వచ్చినట్టు అధికారులు వ్యవహరిస్తూ ఇష్టారీతిన వ్యవహరిస్తున్నందున నలుగురు ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఎర్రబెల్లి శరత్, రావుల వెంకటరెడ్డి,బొడ్డు లెనిన్, బొడ్డు అరుణ రాజీనామాచేశారు.

## ఏనుగు ఆకారపు పంది పిల్ల ఘటన.

**సి కె న్యూస్ వనపర్తి జిల్లా స్టాఫ్ రిపోర్టర్**



నాగర్ కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం పెద్ద కారు పాముల గ్రామంలో ఈ వింత చోటుచేసుకుంది
యజమాని పెద్ద కారు పాముల గ్రామానికి చెందిన కూరాకుల వెంకటయ్య పందులు పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నాడు ఆయన పెంచుతున్నటువంటి ఒక పంది ఏడు పిల్లలకు జన్మనిచ్చింది వింత రూపము ఆ 7 పిల్లలకు అచ్చం ఏనుగు తొండం ఆకారం తలకు ఇరువైపులా పెద్ద చెవులతో పుట్టింది చూస్తే ఎవరైనా ఏనుగు పిల్ల అని భ్రహ్మ పడేలా ఉంది దురదృష్టవశాత్తు ఆ వింత పంది పిల్లలతో పాటు మరో పిల్ల కూడా పుట్టిన కొద్దిసేపటికి చనిపోయాయి మిగిలిన ఐదు పిల్లలు ఆరోగ్యంగా ఉన్నాయి ఈ విషయం తెలియగానే పంది కడుపున ఏనుగు పిల్ల అని వార్త దావగ్ని లా వ్యాపించింది వింత పిల్లను చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వెంకటయ్య ఇంటికి బారులు తీరారు చాలామంది దీనిని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కాలజ్ఞానంతో ముడిపెడుతూ కలియుగంలో ఇలాంటి వింతలు జరుగుతాయని బ్రహ్మంగారు చెప్పారని చర్చించుకుంటున్నారు పశు వైద్యులు నిపుణులు జన్యుపరమైన లోపం వల్లజరిగిన పరిణామమని పశు వైద్య నిపుణులు నిర్ధారణ చేశారు

# ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి.

**- జిల్లా కలెక్టర్ అంకిత్.**



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,ఏప్రిల్ 21,** జిల్లాలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం తహసీల్దారు లు, ఎంపీడీవో లు, ఏటీఎంలు మరియు సంబంధిత శాఖల అధికారుల తో టెలికాన్ఫరెన్స్ ద్వారా ధాన్యం కొనుగోలు పై సమీక్ష సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా సుమారు 83,635 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఈ లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకొని మొత్తం 168 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోళ్లు చేపట్టేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 56 కొనుగోలు కేంద్రాలకు ధాన్యం చేరిందని, ముఖ్యంగా ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి ప్రాంతాల్లో అధికంగా ధాన్యం వచ్చినట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు ధాన్యం గ్రేడింగ్ ప్రక్రియను సక్రమంగా నిర్వహిస్తున్నారని తెలిపారు .
రైస్ మిల్లర్ల నుండి ప్రభుత్వ నిబంధనల ప్రకారం బ్యాంక్ గ్యారంటీలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.
కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, టెంట్లు, తాగునీరు, విద్యుత్ వసతి కల్పించడంతో పాటు టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, తూకం యంత్రాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు..
నిర్దేశిత మార్గదర్శకాలకు అనుగుణంగా కొనుగోళ్లు పకడ్బందీగా నిర్వహించాలని, కూలీలు అందుబాటు లో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులు తమ కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారానే విక్రయించాలని పిలుపునిచ్చారు. ధాన్యాన్ని తాలు, తడి లేకుండా శుభ్రంగా కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు.
కొనుగోలు కేంద్రాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ, మిల్లుల కేటాయింపులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

## భద్రగిరి మార్ట్ సృష్టి పై ప్రశంసల జల్లు ...!

**- ఐటీడీఏ పిఓకు సీనియర్ ఐఏఎస్ అధికారిని శాంతి కుమారి అభినందనలు..**



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 21,** భద్రాచలం పట్టణంలో ఏర్పాటు చేసిన భద్రగిరి మార్ట్ ఎంతో ప్రయోజనకరమని దీని ఏర్పాటులో విశేషంగా కృషి చేసిన భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ ఐఏఎస్ అభినందనీయులని మెచ్చుకుంటూ వైస్ చైర్‌పర్సన్ మరియు డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎం.సి.ఆర్ హెచ్.ఆర్.డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ తెలంగాణ ఐటీడీఏ పీవో రాహుల్ కు ప్రశంసా పత్రం పంపించారు. భద్రాద్రి మార్ట్ చేస్తున్న ప్రశంసనీయమైన కృషిని నేను ఈ పత్రం ద్వారా అభినందిస్తున్నట్లు తెలిపారు.
స్థానిక గిరిజన ఉత్పత్తులకు విలువను జోడించి, బ్రాండింగ్ కల్పించి, భద్రగిరి మార్ట్ ద్వారా మార్కెట్ సౌకర్యాలను కల్పించడంలో మీ చొరవ నిజంగా అభినందనీయం అన్నారు.ఈ ప్రయత్నం గిరిజన వర్గాల ఆదాయాన్ని పెంచడమే కాకుండా, వారి ఉత్పత్తులను విస్తృత మార్కెట్‌లతో అనుసంధానించడం ద్వారా వారిని సాధికారులను చేస్తుందని మరియు సమగ్ర అభివృద్ధికి ఇది ఎంతో తోడ్పడుతుందని నేను నమ్ముతున్నట్లు ఆ ప్రశంస పత్రంలో పేర్కొన్నారు.

## గోదావరి కరకట్ట ప్రదేశాలలో ప్రకృతి వనం ఏర్పాటు.

**భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట.**

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 21,** భద్రాచలంలోని గోదావరి నది ఒడ్డున ఉన్న దశాబ్దాల నాటి పురాతన చెత్త డంప్ సైటును ఐటీడీఏ పీవో బి రాహుల్ మరియు గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి పనిచేసిన సమయంలో ఆయన మద్దతుతో సబ్ డివిజనల్ అడ్మినిస్ట్రేషన్ సమగ్ర గ్రీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం ప్రారంభించడంతో గోదావరి కరకట్ట ప్రదేశాలలో ప్రకృతి వనం ఏర్పాటుకు మార్గం సుమగమైనదని భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట అన్నారు.



మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయం నుండి గత సంవత్సరం గోదావరి కరకట్ట ప్రదేశాలలో చేపట్టిన కార్యక్రమాల గురించి ఆయన పూర్తిస్థాయిలో వివరించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 2025 మరియు ఫిబ్రవరి 2026 మాసంలో ప్లాస్టిక్ వ్యర్థాలను 100 కిలోల వరకు తొలగించడం జరిగిందని అలాగే అక్టోబర్ 2025లో ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని ఐదు ఎకరాలలో పదివేల యూకలిప్టస్ మొక్కలు గ్రామ పంచాయతీ సహకారంతో నాటించి వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవడం జరిగిందని అన్నారు. నవంబర్, డిసెంబర్ 2025 మాసములో దశాబ్దాలుగా పేరుకుపోయిన చెత్తను క్లియర్ చేయడానికి భారీ యంత్రాలను మోహరించి, ఇసుక ఎక్స్ వెయిటర్ లారీలు వ్యర్థాలను గ్రామ పద్ధతిలో తొలగించడం జరిగిందని అన్నారు. క్లియర్ చేసిన భూమిని గ్రైండింగ్ చేసి ప్లాంటేషన్ కోసం సిద్ధం చేసి భద్రాచలం జిపి ద్వారా బయో రీమిడేయేషన్ ప్రయత్నంగా పదివేల యూకలిప్టస్ మొక్కలు నాటి గ్రామ పంచాయతీ భద్రాచలం ద్వారా క్రమం తప్పకుండా వాటి సంరక్షణ బాధ్యతను తీసుకున్నారని అన్నారు.
గోదావరి ఒడ్డున ఉన్న గ్రీన్ జోన్ క్లైమ్ చేసిన వ్యర్థాల డంపింగ్ యార్డ్ నుండి కనిపించే రూపాంతరం రాబోయే రెండు మూడు సంవత్సరాల లో గోదావరి నది తీర ప్రాంతం యొక్క పర్యావరణ ఆరోగ్యాన్ని గన్నియంగా పెంచుతుందని ప్రాంతాన్ని మరింత శుభ్రపరచడం మరియు పునరుద్ధరించడంలో మంచి పురోగతి సాధిస్తుందని అన్నారు.
దీని ప్రభావం వలన దశాబ్దాల నాటి చెత్త డంపింగ్ స్థలం గోదావరి పొడవున మంచి గ్రీన్ జోన్ గా రూపాంతరం చెంది పర్యావరణ సమతుల్యతను పునరుద్ధరిస్తుందని దీంతో ఈ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజానీకానికి ఆరోగ్యం మెరుగు పడుతుందని అన్నారు.
సారపాక భద్రాచలం వంతెన జాతీయ రహదారి అధికారులతో నిరంతర సమన్వయం ఫలితంగా 2026 మార్చ్ లో సారపాక భద్రాచలం వంతెన పై వీధిలైట్లు ఏర్పాటు చేయబడ్డాయని దీర్ఘకాలంగా ఉన్న ప్రజా భద్రత సమస్యను పరిష్కరించడం జరిగిందని అన్నారు.

సి ఎస్ ఆర్ కార్యకలాపాల కింద ఐటీసీతో సమన్వయం చేసుకొని వంతెనకు రెండు వైపుల నుండి అప్రోచ్ రోడ్ల మధ్యస్థం పొడవునా పూల పెంపకం మరియు గ్రీన్ కవర్ పెంపుదల చేపట్టిందని, మార్చి 2026 లో పూర్తయిందని, దీని ఫలితంగా సౌందర్యం మరియు ఆకుపచ్చ కవర్ గనియంగా మెరుగుపడిందని అన్నారు.
బ్రిడ్జి ఇకె ఇల్యూమీనేషన్ ద్వారా మెరుగైన రహదారి భద్రత, కీలకమైన ధమనుల రోడ్ల వెంట సౌందర్యం మరియు గ్రీన్ కవర్ తో గణనీయమైన మెరుగుదల, పరిపాలన మరియు కార్పొరేట్ సిఎస్ఆర్ మధ్య సమర్థవంత మైన సమన్వయం ద్వారా సాధించబడిందని ఆయన అన్నారు.

## రైతులు సమస్యలపై డిఎం శ్యామ్ కుమార్ కు వినతిపత్రం అందజేసిన రైతు సంఘం నాయకులు



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని మండలం నాగలవంచ గ్రామానికి వచ్చిన మార్క్ఫెడ్ ఐవీ శ్యామ్ కుమార్ కి రైతుల సమస్యలపై వినతి పత్రం ఇస్తున్న రైతు నాయకులు రౌతు అప్పారావు, ఆలస్యం రవి, అంబటి లచ్చయ్య, అంబటి సత్యం, మరియు రైతులు... ఈ కార్యక్రమం లోతదితరులు పాల్గొన్నారు

## మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు: పెద్దమందడి ఎస్సై జలేందర్ రెడ్డి



**సీకే న్యూస్ ప్రతినిధి, వనపర్తి జిల్లా**
పెద్దమందడి పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై జలేందర్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఆల్వాల గ్రామ చౌరస్తాలో ఆయన ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు.
ఈ సందర్భంగా వాహనదారులను ఆపి మద్యం పరీక్షలు నిర్వహించగా, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.
ఎస్సై మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడిపే వారు తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా ప్రమాదంలోకి నెడుతున్నారని తెలిపారు. ఇటీవల రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ తనిఖీలు చేపట్టినట్లు చెప్పారు.
ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, మద్యం సేవించి వాహనం నడపకూడదని సూచించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారితీస్తుందని పేర్కొన్నారు.
ప్రజలు పోలీసులకు సహకరించి సురక్షిత రవాణా వ్యవస్థకు తోడ్పడాలని ఆయన కోరారు.

## ఉపాధ్యాయునీ వీడ్కోలు, విరమణ మహోత్సవం

**గురువు బాటలో శిష్యులు నడవాలి**



**ఏప్రిల్ 21 (సీ కే న్యూస్) చేగుంట**
చేగుంట మండలం చిన్నశివ్నూర్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో సోషల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న, శ్రీ బత్తుల రాములు పదవీ విరమణ మహోత్సవం మంగళవారం నాడు పాఠశాల ప్రాంగణంలో అత్యంత ఘనంగా పదవి విరమణ జరిగింది. సభ అధ్యక్షుడు ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎంఈఓ నీరజ, గ్రామ సర్పంచ్ వరలక్ష్మి స్వామి గౌడ్ పాల్గొని రాములు దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తు కోసం రాములు, అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎంలు వెంకట్ రాంరెడ్డి, కృష్ణారావు, కొండల్ రెడ్డి, విట్టల్ రెడ్డి, పొన్నమల రాములు, చేగుంట మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నర్సింహారావు, జగన్ లాల్, మనోహర్ రావు, నాగరాజు, బాలపోచయ్య, తిరుపతి రెడ్డి, వెంకటేష్, కృష్ణమూర్తి, మల్లికార్జున్ పాల్గొన్నారు. అలాగే ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు వారాల నర్సింలు, అమ్మ కమిటీ చైర్మన్ రేణుక, పాఠశాల ఉపాధ్యాయులు రాజశేఖర్ రెడ్డి, చక్రధర్, రాజశేఖర్, సుధాకర్, రాజిరెడ్డి, మాజీ హెచ్ఎం ఫర్జానా, ఇతర ఉపాధ్యాయులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని రాములుకి పదవీ విరమణ శుభాకాంక్షలు వారు తెలిపారు.

# రోడ్డు ప్రమాదాలు,సైబర్ క్రైమ్స్ బారిన పడకుండా జిల్లా ప్రజలకు నిత్యం అవగాహన కల్పించాలి.

- సామాన్య ప్రజానీకాన్ని ఇబ్బందులకు గురి చేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలి :
- ఎస్పీ రోహిత్ రాజు.
- జిల్లా పోలీసు అధికారులతో ఏర్పాటు చేసిన నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ రోహిత్ రాజు.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,ఏప్రిల్ 21,**జిల్లా ఎస్పీ రోహిత్ రాజు జిల్లాలోని పోలీసు అధికారులతో మంగళవారం నేర సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు గల కాన్ఫరెన్స్ హాలు నందు అధికారులతో సమావేశమయ్యారు. ముందుగా విధులు నందు ఉత్తమ ప్రతిభను కనబరిచి రివార్డులను అందుకున్న పోలీస్ అధికారులను, సిబ్బందిని అభినందించారు.అదే విధంగా పలు కేసులలో సమగ్ర విచారణ జరిపి నేరస్తులకు శిక్ష పడే విధంగా కృషి చేసిన పోలీసు అధికారులు సిబ్బందికి ఎస్పీ ప్రశంసా పత్రాలను అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో అధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి అక్కడ నివారణా చర్యలను చేపట్టాలని సూచించారు.అనంతరం అన్ని పోలీస్ స్టేషన్లలో నమోదైన పెండింగ్లో ఉన్న పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి కేసులో సమగ్ర దర్యాప్తును చేపట్టి ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని తెలిపారు.పోక్సో కేసులలోని నిందితులకు త్వరతగతిన శిక్ష పడే విధంగా కృషిచేయాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణా,మట్కా,క్రికెట్ బెట్టింగులు లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు కలిగించే విధంగా ప్రవర్తించే వ్యక్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలని అన్నారు.అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రతి ప్రదేశంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా చేసి నేరాల నియంత్రణకు పాటుపడాలని అన్నారు.వేసవి కాలం సెలవుల దృష్ట్యా దొంగతనాలు జరగకుండా గస్తీని పెంచి పెట్రోలింగ్,బ్లూ కోల్ట్స్ వాహనాలతో నిత్యం రోడ్లపై సంచరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ఉండాలని సూచించారు.ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా నిత్యం వాహన తనిఖీలు చేపడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.షీ టీమ్స్,భరోసా కేంద్రాల ఆవశ్యకత గురించి అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేసి భాధిత మహిళలకు అండగా ఉండాలని ట్వలిపారు.

ఈ సమావేశంలో పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్, ఇల్లందు డిఎస్పీ వెంకన్న బాబు,మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి,డీసిఆర్బీ డిఎస్పీ మల్లయ్య స్వామీ,సైబర్ క్రైమ్స్ డిఎస్పీ అశోక్,ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,డీసిఆర్బీ సీఐ సర్వయ్య ,సిసిఎస్ ఇన్స్పెక్టర్ రమాకాంత్,ఐటీ సెల్ ఇన్స్పెక్టర్ రాము,ఏవో మంజ్యా నాయక్,ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## జనగణన పారదర్శకంగా నిర్వహించాలి: జనగణన తెలంగాణ డైరెక్టర్ భారతి హోలికేరి



**ఏప్రిల్ 21 (సీ కే న్యూస్)** చేగుంట మండలంలోని వడియారం లో జనగణ శిక్షణ ముగింపు కార్యక్రమానికి జన గణన తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ భారతి హోలీ కేరి, మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనగణన పారదర్శకంగా నిర్వహించాలని, జనగణలో అన్ని విషయాలు వచ్చే విధంగా చూడాలని, ఎనిమరేటర్స్, సూపర్వైజర్స్ ఇచ్చే సమాచారము రాబోయే తరాలకు చాలా ఉపయోగపడుతుందని, ప్రజలిచ్చే సమాచారానికి సంక్షేమ పథకాలకు సంబంధం లేదని, ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించే విధంగా ప్రయత్నించాలని, ఎనిమరేటర్స్ సూపర్వైజర్స్ అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. హౌస్ లిస్టింగ్ పైన సూచనలు కూడా ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీవో జయచంద్ర రెడ్డి, చేగుంట చార్జ్ ఆఫీసర్ శివప్రసాద్, ఏ ఎస్ ఓ భూమేష్, ఫీల్డ్ ట్రేనర్స్ చల్లా లక్ష్మణ్, జంగం మల్లేశం, ఎనిమరేటర్స్ సూపర్వైజర్స్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ అన్నపూర్ణ కాశీ విశ్వేశ్వర స్వామి శివలింగ పునప్రతిష్ట ,సుబ్రహ్మణ్య స్వామి జంట నాగుల ప్రతిష్ట కార్యక్రమం.








**సి కే న్యూస్ వలిగొండ మండలం తేదీ:20/04/2026** సోమవారం రోజున ఉదయం 10:56 నిమిషాలకు శివలింగ మరియు సుబ్రహ్మణ్య స్వామి వార్ల (యంత్ర స్థాపన) యంత్ర ప్రతిష్ట, శివలింగం మరియు సుబ్రహ్మణ్యస్వామి జంట నాగుల విగ్రహ ప్రతిష్ట ఈరోజు జరిగింది శివాలయం గుడి వేములకొండ గుడి దగ్గర శివపార్వతుల కళ్యాణం మహోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథులు భువనగిరి శాసనసభ్యులు శ్రీ కుంభం అనిల్ కుమార్ రెడ్డి గారు ఈరోజు వేములకొండ గ్రామంలో శివపార్వతుల కళ్యాణంలో పాల్గొనడం జరిగింది ఇట్టి కార్యక్రమానికి పెద్దలు లిగ్రామ సర్పంచ్ ఏర్పుల వెంకటేశం గారు, ఉప సర్పంచ్ అంబటి సాయికుమార్ , శివాలయం కమిటీ అధ్యక్షులు వెల్లంకి సుదర్శన్ రెడ్డి , పాలకవర్గం వార్డ్ మెంబర్స్, రిటర్మెంట్ హెడ్మాస్టర్ కట్ట రమేష్ , మరియు సీనియర్ నాయకులు కేశిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి నీరజ రెడ్డి , సీనియర్ నాయకులు పులిపలుపుల రాములు గౌడ్, ఎస్.కె రసూల్,గాజుల మల్లేశం ఆరూరి రమేష్,మునగల సురేష్ . కాడిగాలింగయ్య, పులిపిలుపుల సాయి, పులి పల్సుల లెనిన్ గౌడ్, గ్రామ పెద్దలు మరియు అధిక సంఖ్యలో పాల్గొన్రు

## స్పష్టమైన ప్రణాళికతో విద్యా సంవత్సరాన్ని ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలి..



జిల్లా విద్యాశాఖ అధికారి బి. నాగలక్ష్మి.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,ఏప్రిల్ 21,**ఈ విద్యా సంవత్సరం జరిగిన ప్రగతిని సమీక్షించుకొని స్పష్టమైన ప్రణాళికతో వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి బి. నాగలక్ష్మి అన్నారు. జిల్లా విద్యాశాఖ మండల విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు,ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు తో ఈరోజు కలెక్టరేట్ మీటింగ్ హాల్లో జరిగిన సంవత్సరాంత సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం ప్రాథమిక స్థాయిలో ఎఫ్ ఎల్ ఎన్ ఉన్నత స్థాయిలో అభ్యసన అభివృద్ధి కార్యక్రమం లో జరిగిన ప్రగతిని లోటుపాట్లను సమీక్షించుకొని వచ్చే విద్యా సంవత్సరం ఉన్నతమైన ఫలితాలు సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. విద్యాశాఖలో జరిగే వివిధ కార్యక్రమాలైన పాఠశాల వారి విద్యార్థుల నమోదు, మూతబడిన పాఠశాలను తిరిగి తెరిపించడం, అదేవిధంగా గత సంవత్సరానికి ఈ సంవత్సరానికి నమోదులో మార్పు, పిల్లల ఆధార్ అపార్ పరిస్థితి, ప్రతి పాఠశాల యొక్క మౌలిక వసతుల లభ్యత మొదలగు అంశాలపై ప్రస్తుత స్థితిని తెలియజేస్తూ వచ్చే విద్యా సంవత్సరానికి ఎటువంటి లక్ష్యాన్ని నిర్దేశించుకుని పని చేయాలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలిపారు. అదేవిధంగా పాఠశాలల్లో పెండింగ్లో ఉన్న మరమ్మతులు నిర్మాణ పనులపై కూడా ఆయా ఇంజనీరింగ్ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులతో కలిపి సమీక్ష చేశారు. ఈ సంవత్సరం ప్రాథమిక స్థాయిలో ఎఫ్ ఎల్ ఎన్ మరియు ఉన్నత స్థాయిలో అభ్యసన అభివృద్ధి కార్యక్రమం, మండల విద్యాశాఖ అధికారులు కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు పాఠశాలలను సందర్శించిన వివరాలు మొదలగు వాటిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారికి చూపించి ఈ సంవత్సరం ఫలితాలను బేరీజు వేసుకొని వచ్చే సంవత్సరం 100% ఫలితాలు సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. పిల్లలు వేసవి సెలవులలో అభ్యసన ప్రక్రియకు దూరం కాకుండా ఉండటానికి వారికి 45 రోజులు పాటు ఎటువంటి రాత పనిని ఇవ్వాలో దిశా నిర్దేశం చేస్తూ పిల్లలందరూ ఈ రాత పనిలో నిమగ్నం అయ్యే విధముగా ఉపాధ్యాయులు కృషి చేయాలని, దానికై ప్రధానోపాధ్యాయులు మండల విద్యాశాఖ అధికారులు సంయుక్తంగా ఒక కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని విద్యార్థుల్లో అభ్యసన లోపం లేకుండా చూడాలని కోరారు. వివిధ మండలాల్లో భవిత భవనాల నిర్మాణం లో జరుగుతున్న జాప్యాన్ని నివారించి పాఠశాలలు పునః ప్రారంభం నాటికి పిల్లలకి అందించాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఏ. నాగరాజశేఖర్, సమ్మిళిత విద్య కోఆర్డినేటర్ ఎస్ కే సైదులు, ప్లానింగ్ కోఆర్డినేటర్ ఎన్. సతీష్ కుమార్, బాలిక విద్యా కోఆర్డినేటర్ జే. అన్నామని, జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారులు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు, విద్యాశాఖ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## ఆర్క హాస్పిటల్ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం: ఏప్రిల్ 26న చింతకానిలో మూడు విభాగాల నిపుణులతో సేవలు.

**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**చింతకాని గ్రామ ప్రజల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా ఆర్క హాస్పిటల్ ఆధ్వర్యంలో గాయాల చికిత్స, అత్యవసర వైద్యం, బహుళ ప్రత్యేక వైద్య సేవలతో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. గ్రామ సర్పంచ్ కీలారు మనోహర్‌బాబు సహకారంతో ఈనెల 26వ తేదీ ఆదివారం చింతకాని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉదయం నుంచి ఈ మెగా ఉచిత వైద్య శిబిరం జరగనుంది. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉన్నత స్థాయి వైద్యం అందుబాటులోకి తేవాలనే ఉద్దేశంతో ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో చెవి, ముక్కు ఢ గొంతు, ఎముకలు ఢ కీళ్ళు మరియు సాధారణ వైద్య విభాగాలకు చెందిన ప్రముఖ వైద్య నిపుణులు ప్రత్యక్షంగా పరీక్షలు నిర్వహించి, ఉచితంగా వైద్య సలహాలు అందించనున్నారు. వైద్యులు ఆర్. రవికుమార్ చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులుగా సేవలు అందిస్తారు. చెవి నొప్పి, చెవిలో చీము, చెవిలో శబ్దం, కుహర వ్యాధి, అలర్జీ, ముక్కు బంద్, గొంతు నొప్పి, స్వరం మారడం, దగ్గు, గురక, తల తిరుగుడు, గళగ్రంథి సమస్య, ఉచిత ముక్కు ఢ గొంతు అంతర్దర్శిని పరీక్షలు అవసరమైన వారికి చేస్తారు. వైద్యులు తక్కెళ్లపల్లి దుష్యంతరావు ఎముకలు మరియు కీళ్ళ శస్త్ర చికిత్సా నిపుణులుగా కీళ్ళ మార్పిడి, పునర్ కీళ్ళ మార్పిడి, కీళ్ళవాత వ్యాధి, నడుము నొప్పి, కీళ్ళ నొప్పులు, భుజము నొప్పి, ఎముక విరుగుడు శస్త్ర చికిత్స, సూక్ష్మ రంధ్ర కీలు శస్త్ర చికిత్స, పిల్లల ఎముకల వైద్య సేవలు అందిస్తారు. వైద్యులు కృష్ణసాగర్‌రెడ్డి సాధారణ వైద్య నిపుణులుగా వైరల్ జ్వరం, రక్త కణాల తగ్గుదల, విష ప్రభావ కేసులకు చికిత్స, రక్తపోటు, ఉబ్బసం, దగ్గు, రక్తహీనతకు చికిత్స, రక్తపోటు, మధుమేహం వాడకికి ప్రత్యేక చికిత్స, మూర్ఛ, పక్షవాతం, నరాల జబ్బులు వంటి వాటికి వైద్యం అందిస్తారు. శిబిరం వివరాలు: తేదీ 26 ఏప్రిల్ 2026, ఆదివారం ఉదయం నుంచి, వేదిక గ్రామ పంచాయతీ కార్యాలయం, చింతకాని గ్రామం ఢ మండలం, ఖమ్మం జిల్లా. చింతకాని మండల ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వైద్యులు కోరారు. ఉచితంగా నిర్వహించే ఈ మెగా వైద్య శిబిరానికి పెద్ద ఎత్తున తరలిరావాలని గ్రామ సర్పంచ్ పిలుపునిచ్చారు.

## గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు.



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**చింతకాని మండలం రాఘవపురం గ్రామంలో కనపర్తి సత్యనారాయణ మౌనిక లు నిర్మించుకున్న ఇందిరమ్మ గృహం ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు కన్నెబోయిన గోపి కొప్పుల గోవిందరావు గ్రామ ఉపసర్పంచ్ అబ్బూరి మహేష్ మాజీ సర్పంచ్ కొనుపర్తి గోవిందరావుపెద్దలు కొల్లి గోవిందరావు శ్రీనివాసరావు దొబ్బల వెంగళరావు తదితరులు పాల్గొన్నారు

## చలివేంద్రాలు నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దు.

- కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 21,** నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలకు సిఫారసు చేస్తామని, కార్పొరేషన్ పరిధిలోని వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను అధికారులు నిత్యం పర్యవేక్షించాలని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ హెచ్చరించారు. కార్పొరేషన్ కార్యాలయంలో తాగునీటి సరఫరా, చలివేంద్రాల నిర్వహణపై మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని నిత్యం అందుబాటులో ఉంచాలని, నీటిని అందించే వర్కర్లు చలివేంద్రాల వద్దే ఉండి సేవలు అందించేలా చూడాలని ఆదేశించారు. ప్రస్తుతం పట్టణంలోని 11 ప్రధాన సెంటర్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేశామని, ప్రజల అవసరాల దృష్ట్యా మరిన్ని కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లలో ఎక్కడా తాగునీటి ఎద్దడి రాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. స్థానిక శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ప్రత్యేక కృషితో అమృత్ స్కీం కింద మంజూరైన నిధులతో పట్టణంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఆయన వివరించారు. ప్రజలకు కనీస సౌకర్యాల కల్పనలో రాజీ పడే ప్రసక్తే లేదని, ప్రతి చుక్క నీరు సద్వినియోగం అయ్యేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఆయన పునరుద్ఘాటించారు.